# కీర్తి కండూతి



*ఘటం భింద్యాత్ పటం చింద్యాత్*
*కుర్యాద్వా గార్థభ స్వరం*
*ఏనకేనాప్యుపాయేన*
*ప్రసిద్ధః పురుషో భవేత్*

***భావం:*** కుండను బద్దలు కొట్టో, బట్టలుచింపివేసో, గాడిద వలె అరిచో ఏదో ఒక ఉపాయంచేత మనుష్యుడు ప్రసిద్ధుడు కావాలి.

దేవల గ్రామమంతా కోలాహలంగా ఉంది. గ్రామంలో కేశవుడనే యువకుడు కాశీ వెళ్ళి అన్ని శాస్త్రాలూ చదువుకుని వచ్చాడు. అతని పాండిత్యం

దశదిశలా పాకింది. ఆ సంవత్సరం మహారాజు శరన్నవరాత్రుల సందర్భంగా జరిపే పండిత సత్కార గ్రహీతలలో కేశవుడి పేరుంది. ఆస్థానానికి తీసుకువెళ్ళడానికి కోట నుంచి పల్లకీ వచ్చింది. కేశవుడి తల్లిదండ్రులు ఊరందరినీ పిలిచి విందులతో, వినోదాలతో ముంచెత్తారు. ఎంతటి ఆనందకరమైన విషయమైనా కొందరిలో అసంతృప్తిని కల్గిస్తుంది. నారాయణుడి తల్లిదండ్రులు తమ కొడుక్కి నాగలి పుచ్చుకుని పొలం దున్నడమే తప్ప చదువబ్బలేదని బాధపడ్డారు.

పొలంనుంచి వచ్చిన కొడుకుతో " ఒరే నారాయణా, కేశవుణ్ణి చూడు చక్కగా రాజ సన్మానం పొందుతున్నాడు. కేశవుడు చదివిన గురువు గారి దగ్గరే నిన్నూ చదువుకుందుకు పంపాం. నాలుగు అక్షరం ముక్కలు వచ్చేసరికి చదువాపేశావు. గ్రామంలో తలెత్తుకోలేకపోతున్నాం" అన్నారు. నారాయణుడికి కోపం వచ్చింది. "మా గురువుగారు శత శ్లోకేన పండితః అని చెప్పారు. నాకు వంద శ్లోకాలు వచ్చు. నేనూ పండితుణ్ణే" అన్నాడు. "పండితుడివైతే నీకూ సన్మానం చేద్దురు. ఎద్దులా తినడం, ఎడ్లని తోలడం తప్ప ఎందుకూ పనికిరావు" అని తల్లిదండ్రులు నిందించారు.

నారాయణుడు ఆ క్షణమే ఇల్లువదిలి బయల్దేరాడు. ఊరి చివరి చెరువులో దూకి చచ్చిపోదామనుకుంటూంటే ఆ ప్రయత్నంలోనే ఉన్న మాధవుడూ, గోవిందుడూ కన్పించారు. మాధవుడు నూనె గానుగ నడుపుతాడు. గోవిందుడు పసులకాపరి. వారి తల్లిదండ్రులూ వారిని తిట్టారు. ముగ్గురూ విషయం చెప్పుకున్నారు. చచ్చిపోవడంకాదు. సన్మానం చేయించు కోవాలనుకున్నారు. రాజుగారి కోటకు బయల్దేరారు.

రాజధాని చేరుకున్నాక ముగ్గురికీ సందేహం వచ్చింది. ఏం చేసి మంచి పేరు సంపాదించి రాజ సన్మానం పొందాలా అనుకుంటూండగా నారాయణుడికి చిన్ననాడు గురుకులంలో చదివిన శ్లోకం గుర్తొచ్చింది. "కుండ బద్దలుకొట్టో, బట్ట చింపో,గాడిదలా అరిచో ప్రసిద్ధి పొందచ్చుట. అదిగో

నేను ఆ దుకాణంలో అన్నిటికన్నా పెద్ద కుండ విరక్కొడతాను" అంటూ దుకాణంలో కుండను తీసుకుని దారిమధ్యలో విరక్కొట్టాడు.

దుకాణందారు కేకలకు రాజభటులు వచ్చి నారాయణుడిని పట్టుకున్నారు. అతడేదో చెప్పబోతూంటే "రాజాస్థానంలో చెప్పుకో" అంటూ పట్టుకుపోయారు.

"ఓహో రాజాస్థాన ప్రవేశం ఇంత సులభమా" అంటూ మాధవుడు కొట్టులోని కొత్త చీరను చింపేశాడు. గోవిందుడు నాలుగుదార్ల కూడలిలో నిలబడి గాడిదలా అరిచాడు. వారిద్దరినీ కూడా రాజ భటులు తీసికెళ్ళారు.

రాజ సభలో నేర విచారణ సమయంలో ముగ్గురూ "మహారాజా, కీర్తి సంపాదించి తమచే సన్మానం పొందడానికి ఆ పనులు చేశాం " అంటూ తమకి తెల్సిన శ్లోకం చదివారు. మహారాజుకి విషయం పూర్తిగా అర్థంకాలేదు. రాజుకి కానుకలు సమర్పించడానికి వచ్చిన గ్రామాధికారి వారిని గుర్తించి, వారితో మాట్లాడి, మహారాజుకి విషయం వివరించాడు.

వారి అమాయకత్వానికి నవ్వుకుని మహారాజు వారిని క్షమించి వదలివేశాడు. ముగ్గురినీ తీసుకుని గ్రామాధికారి ఊరికి వచ్చి వారి తల్లిదండ్రులను పిలిచి చీవాట్లు పెట్టాడు. "ప్రపంచంలో అందరూ పండితులవగలరా? దేశానికి రైతూ, పశుపోషకుడూ, నూనె వర్తకుడూ లేకపోతే ఎంత నష్టం? పండితులకన్నా వీరే ముఖ్యం. మహారాజు క్షమించకపోతే ఏమయ్యేది? మీ కొడుకులు చెరువులోపడి చచ్చిపోతే ఏమయ్యేది? కీర్తికండూతికన్నా భయంకర రోగం లేదు."అని చెప్పాడు. వారికి జ్ఞానోదయం కలిగింది.

తల్లి దండ్రులూ... మరి ఆలోచించండి.

******